# శమంతకమణితో ఇన్‌టర్వ్యూ

ఓన అరకప్పు కాఫీ, ఒక యిడ్లీ ముగించి సిగరెట్ వెలిగించాడు సుబ్బారావు, తెనాలి రైలు స్టేషన్ రోడ్డుమీది పాక హొటల్లో.

"పద" అన్నాడు.

"ఎక్కడికి? ఎందుకు?" అనుకున్నాను. కాని అనలేదు. అని లాభం లేదు సుబ్బారావుతో. మళ్ళీ అతనినించి విడిబడి రైలెక్కి తెనాలి పొలిమేర దాటేవరకు అతను నా జీవిత నిర్ణయ విధాత.

హొటలు బైటికివచ్చి, నా(గ్రీకు శాండల్సుతో తెనాలి కంకరరోడ్డు బురదలో నడవడానికి జంకుతో నుంచున్నాను.

"వొచ్చినపని అయింది. ఇంకెక్కడికి లాక్కు వెడుతున్నాడు?" అనుకున్నాను. వొచ్చినపని ఏమిటంటే సుబ్బారావుతో కాఫీ తాగడం. తెనాలి కాఫీ హొటల్లో సుబ్బారావుతో కాఫీ తాగడం నా జీవితానికి పట్టిన అదృష్టాల్లో ఒకటి. మరి సుబ్బారావుని గురించి ఏం రాయలేదే, శేషాచారిని గురించి కూడా రాశావుకదా అంటే, రాయడానికి కలానికి చిక్కని, గొప్పతనమే గొప్పతనం.

ఈదురుగాలి మామీద దయతలిచి మబ్బుల్ని తరిమేస్తోంది, కాలం నాపదచిహ్నాల్ని గుర్తించలేదు, పలకరించలేదు. పూర్వకాలపు నా మిత్రుల్నీ, ప్రియుల్నీ, రక్తంలో ఆప్తుల్నీ తలుచుకుంటున్నాను.

వంతెన స్లోపులో బురదలో నా కాలు జారింది.

"పాడు వూరు" అన్నాను.

సుబ్బారావు నవ్వాడు.

"తెనాలిలో వుండగల అదృష్టం పట్టని మనుషులు అట్లానే తిట్టుకుని సంతుష్టి పడతారు" అన్నాడు.

"అదృష్టం కూడానా?"

"కాక! తెనాలి ఓ కళా సముద్రమనుకో. మణులు, ముత్యాలు...."

"చాపలు, తిమింగలాలు....."

"అవును. రుచైన చాపలూ, ఆరోగ్యాన్నిచ్చే చమురునిచ్చే తిమింగలాలూ, మెరిసే ముత్యాలు అన్నీ వున్నాయి ఈ వూళ్ళో ఎక్కువగా. కాని అవి ఈ సముద్రాన్ని ఒదిలితేనేగాని ప్రకాశించవు. కాని వదలరు. ఈ వూరు, ఆ చాపలూ, ముత్యాలూ సముద్రాన్ని వదలనట్టే. కాని విలువ తెలిసి వాటిని ఎవరన్నా బైటికి లాగారా, అవి గొప్పగా ప్రకాశిస్తాయి."

"మరి మీరు వదలరాదూ?"

"మనుషులకి అలంకారాలూ, రుచులూ కావడంకన్న సముద్రంతోనే సుఖమూ, శాంతీకదూ, చాపకీ, ముత్యానికీ"

"మరి నేనూ తెనాలి చేరుకుంటానంటారా చివరికి?"

"నీ కథల పిచ్చి నీకు వదిలినప్పుడు. శమంతకమణి చూడు....ఈ ఇల్లు ఎవరిదను కున్నావు?"

"శమంతక మణిదేనా?"

"కాక, ఎరుగుదువుగా ఆమెని?"

"నాకు తెలీదు"

"ఎరుగుదువులే"

"పోనీలెండి ఇంతకీ ఏమిటీ ఆమె సంగతి?"

"ఆమె సినిమాలలో అంతడబ్బూ ప్రఖ్యాతీ గణించిందా? మధ్యలో అన్నీ వదిలి ఎందుకు వచ్చేసిందంటావు?"

"నాకేం తెలుసు? ఏదో ప్రేమ విరహం అన్నారు, వైరాగ్యమన్నారు. ఇంకేమేమిటో అన్నారు"

"కాదు తెనాలి మీది విరహం"

"పొండి!" అని సుబ్బారావుని తెనాలి బురదలోకి ఓ తోపు తోశాను.

"నిజం. ఏం పందెం?"

"పందానికేం నీకెట్లా తెలుసు?"

"తెలియఖ్కర్లేదు. పద అడుగుదాం?"

"ఆమె ఇంట్లోకి వెళ్ళా? ఛా"

"నువ్వెరుగుదువుగా!"

"ఎరగననలేదూ?"

"ఎరుగుదువులే!"

"నాకంటె మీ కెక్కువ తెలుసా ?"

"సందేహమా ! ఈ విషయంలోనే కాదు....."

ఆ సంగతి నిజమే మరి.

అదిగాక సుబ్బారావు "పద" అంటే, ఇంక లాభంలేదు.

"ఒకవేళ నేను ఎరిగివున్నా, ఆమెకి జ్ఞాపకం వుండవద్దూ !" అన్నాను కడపటి అడ్డ వూపిరితో.

"వుండదు. కాని నీ పేరు చెప్పి ఆమెకి పరిచయం చేసుకో - ఆ దౌర్భాగ్యపు కథలు గీకేవాడిని నేనేనని. గుర్తు వస్తుందిలే"

మా కాళ్ళ రోడ్డు బురదమీద వాళ్ళ వాకిట్లో బురదకోటింగు మెత్తుకుంటో వెళ్ళాము లోపలికి. లోపల చాలామంది ధ్వని చేస్తున్నారు. ఒక అబ్బాయి కనిపించాడు.

"శమంతకమణిగారు వున్నారా" అన్నాడు సుబ్బారావు,

అబ్బాయి తెల్లబోయి చూశాడు.

"సూరమ్మ వుందా?" అన్నాడు మళ్ళీ సుబ్బారావు.

"ఊ" అన్నాడు కుర్రాడు.

వింటున్న ఒకామె లోపల్నించి వచ్చింది.

"సూరమ్మేనా! ఇంక సినిమాలకు రాదుగా" అంది.

"సినీమాలకోసం కాదు"

"ఇంటర్వ్యూలూ ఇవ్వదు" అన్నాడు ఆ అబ్బాయి పాఠం వప్పచెపుతున్నట్టు.

"స్థలాలు ఇంక కొనదు" అంది ఆమె.

"ఫోటోలూ వీల్లేదు" అన్నాడు ఆ అబ్బాయి దిగులుగా.

"ఈయన సూరమ్మని చిన్నప్పుడు ఎరుగును. చూడ్డానికి వచ్చారు" అన్నాడు సుబ్బారావు సిగరెట్టు వాళ్ళ మొహాన దులుపుతో,

"మీది తెనాలా?"

"ఇతనిది తెనాలే ఒకప్పుడు. పాపం ఇట్లా ఐపోయినాడు ఇప్పుడు" అని గొణిగాడు సుబ్బారావు.

"మీది?" అంది ఆమె.

"ఇతనివల్లనే తెనాలి నాదని గర్వపడుతున్నాను" అని గొణిగాను నేను.

ఆమె చప్పున సగౌరవంగా లోపలికి వెళ్ళింది.

ఈమెని చూడవలసిందేనా? నే నెరుగుదును గావును ఈమెని. ఈమె విఖ్యాత నటీమణి కాకపోతే నా మనసు అంత తిరగబడదు. అధికారం, ధనంపొందిన మిత్రులను ఎన్నడూ నాకై నేను కలుసుకోను, ఎందుకంటే వాళ్ళు బతికివుండరు. అహంకారంతో వుబికి కుళ్ళిన వాళ్ళ పీనగలే కనిపిస్తాయి.

అందుకునే చలాన్ని చూస్తే నాకిష్టమైనా సుప్రసిద్ధ రచయిత దుస్తులు ధరించినప్పుడు ఆ చలాన్ని దూరంగాకూడా భరించలేదు, అతను నన్ను విడవక ఎంత వెంబడించినా. సుబ్బారావు అసలే భరించలేడు.

ఆమె తిరిగివచ్చి మమ్మల్ని మళ్ళీ "ఎవరి తాలూకు?" అంది.

"పిల్లలమర్రి" అన్నాడు సుబ్బారావు.

"ఆ పేరు వినడంతోటే ఆమె చప్పున లోపలికి వెళ్ళి కాళ్ళు కడుక్కోడానికి నీళ్ళు తెచ్చి ఇచ్చింది.

సుబ్బారావు నావంక సగర్వంగా చూసి "చూశావా?" అన్నాడు.

"నువ్వు అసలు పిల్లలమర్రివాడవై పుట్టవలిసింది" అంటాడు సుబ్బారావు, నా అప్రాచకాలు అతనికీ మరీ ముద్దొచ్చినప్పుడు. అంతకన్న గొప్ప గౌరవం మనిషికి ఆలోచించుకోలేడు అతను. అతని చేతుల్లోనే వుంటే గాంధిగారికి "మహాత్ముడు" బదులు "పిల్లలమర్రి" అనే బిరుదును ఇస్తాడు. కాని ఆ బిరుదుకే అనేక రకాలవాళ్ళకీ ఇస్తాడు లెండి. మరీ నమ్మకంగా పెరుగుపోసే మనిషికి "బెంగాలీ" అనే ఉత్తమ గౌరవాన్నిచ్చేవాడు విమలేందు బోసు.

సూరమ్మ వసారాలో చాపవేసుకుని చదువుకుంటోంది. ఆమెని చూస్తే చిన్నప్పుడు నేను ఎత్తుకుని ఆడించిన సూరమ్మ గుర్తుకురాలేదు. అందంలేదుగాని, ~~ఈ~~మె మొహంలో ఓ స్తిమితమూ, విజ్ఞానమూ వున్నాయి.

మేమూ ఆ చాపమీద కూచున్న తరవాత తీరికగా పుస్తకం పేజీ గుర్తు పెట్టుకుని అన్‌విల్లింగ్‌గా పుస్తకం మూసి కింద పెట్టింది. ఆ పుస్తకం "వేదాంతసార సంగ్రహం". ఆమెకి సందర్భాలు చెపితే నేను జ్ఞాపకం వొచ్చాను. సిగ్గుపడ్డది. నేనెదోరాస్తానని కూడా దూరంగా తెలుసు. మా వాళ్ళ సంగతులన్ని అడిగింతరవాత,

"మీరిప్పుడు వేదాంతం రాస్తున్నారటగా?" అంది

"నువ్విప్పుడు వేదాంతం చదువుతున్నట్టే"

"మరి ఆ పుస్తకాలు నాకు పంపండి"

సుబ్బారావు నవ్వుతున్నాడు.

"ఎందుకు నవ్వుతారు?" అంది ఆమె.

"వుత్తదొంగ వేదాంతం" అన్నాడు.

ఆమెని చూస్తున్నాను. తెరమీద ఆమెని చూసినప్పుడే అనుకున్నాను, చిన్నతనంలో అంత అందంలేని పిల్ల ఎదిగి ఇంత అందం, ఆకర్షణ ఎట్లా తెచ్చుకుందా అని. ఆమెలో ఎక్కడా అందంలేదు. పట్టి చూసిన కొద్దీ అందవికారాలే కనపడుతున్నాయి.

సుబ్బారావు నన్ను గోకాడు, వొచ్చినపని కానిమ్మని

"నువ్వు అంత ఆకస్మాత్తుగా సినీమాల్ని, వొదిలి వొచ్చేశావేం"

"ఇన్‌టర్‌వ్యూ కాదుకద?" అంది నవ్వుతో.

"కాదు. పందెం మా మధ్య."

"ఏమని?"

"చెపుతాం. ముందు మీరు చెప్పండి" అన్నాడు సుబ్బారావు.

ఆమె మాట్టడంలేదు.

"వేదాంతమా?" అన్నాను.

"అందిచ్చుడాలు లేవు, అబ్బాయ్" అన్నాడు సుబ్బారావు.

"వేదాంతం కాదుకాని, చాలావరకు విరక్తి" అంది.

"దేనికి విరక్తి? ఏమన్నా జరిగిందా?" అన్నాడు సుబ్బారావు.

ఆమె వూరుకుంది.

"రహస్యమైతే చెప్పవొద్దులే" అన్నాను.

"ఎబ్బే! ఏం జరగలేదు. ఏం వూరికేనే విరక్తి రాకూడదా?"

"అసహజం. ఇంక ఏ తారా మీ ముందు నిలవలేదనీ, ప్రజలకి మీ మీద ఆరాధనకి అంతం వుండదనీ, ఇంకా ఎంత గొప్ప చిత్రాలు మీ మూలంగా సృష్టి అవుతాయోననీ అనుకునే సమయాన మీరు మానేశారు. మరి సినిమా అంటే డబ్బు, కీర్తి, పలుకుబడి. అంతకన్న జీవితంలో మనుష్యులు కోరుకోగలిగింది ఏమిటి?" అన్నాడు సుబ్బారావు.

"మీరూ అంతేనంటారా?" అంది నన్ను చూసి.

"ప్రేమ"

"దానికేం కొదవ? సెట్టింగునేల అంతా ప్రేమతో వూరి వుంటుంది" అన్నాడు సుబ్బారావు.

"ప్రేమ బురదతో" అంది ఆమె నవ్వుతో.

"మరి విరక్తి ఎందుకు?"

"ప్రేమే ననుకుంటాను జవాబు. మీరనుకునే ప్రేమకాదు. అసలు మనుషులకీ మనుషులకీ వుండే సహజమైన స్నేహం లేనప్పుడు ఊపిరాడడం కష్టం. అందులో నాకు అందంకూడాలేదు."

"తెలుగు ప్రజలందరూ ప్రేమించారు మమ్మల్ని"

"నన్నా! ఆ తెరమీది మనిషిని, ఆ అందం నాదే నంటారా ?"

"మీరేగా?"

"కాదు. నటనకి అనర్థమే అది. మీరు కథలు రాస్తారు. కవిత్వాలు రాస్తారు. అవి మీలోనించి వస్తాయి. మరి నటన మాలోచించరాదు."

"మా కథల్లో కవిత్వాల్లోకూడా చాలా "మేకప్పులు" వున్నాయి. అన్నాను.

"పైగా చాలా అపభ్రంశంపు రంగుపూతలు" అన్నాడు సుబ్బారావు నన్ను చూస్తో.

"ఎట్లా ఐనా బేధం వుంది. నాకు మాత్రం వుత్త అబద్ధపు బతుకనిపించింది. మా ప్రొడ్యూసర్లకి డబ్బుని సంపాదించి పెట్టే సాధనం నేను, ఎన్ని ప్రేమ సీన్లలో నటించాను" ఒక్కచూపు, మాట నాకు కాదు. నాది కాదు, ప్రజలు కీర్తించేది నన్ను కాదు"

"ఎవరికి మాత్రం జీవితంలో అంతకన్న ఏమొస్తుంది?"

"అట్లా కాదు. మీరు ఏదో రాసినా, ఉద్యోగం చేసినా మీకు అసలు వేరే జీవితం వుంటుంది. సంసారం, బంధువులు, స్నేహితులు."

"మీకూ?"

"సంసారం, బంధువులు, స్నేహితులూ అందరూ డబ్బుకోసం ఆశ్రయించేవారే. మొగవాళ్ళకి ఫరవాలేదనుకుంటాను, సినిమాలోనైనా స్నేహితులుంటారు. స్త్రీకి మాత్రం తక్కిన స్త్రీలూ విరోధులే. అందం వున్న తారకి ఆ అందంవల్లనే విరోధులూ, మిత్రులూ, అందంలేని నాబోటి దానికి అదీ లేదు."

"సంసారంలో మాత్రం ఏ సుఖంలేదూ!"

"మీకు సంసారం వుందా?" అని అడిగింది నన్ను.

"సంసారాలున్నాయి" అన్నాడు సుబ్బారావు.

"అందువల్లనే ఆ చిరాకు" అంది ఆమె.

"నీకు సంసారం లేకనేమో ఆ తప్పు ఆకర్షణ" అన్నాను.

"సంసారమా? సినీమానటికి సంసారమా?"

"చాలా మందికి వున్నాయి"

"వున్నాయి, కాని సుఖం ఏదీ?"

"చాలా సుఖంగా వున్నామని రాస్తున్నారు. పైగా సన్మానాలు జరిగేప్పుడు పిల్లల్నీ, భర్తల్నీ వెంట తెచ్చుకుని ప్రేమ చూపుతో వుంటారు."

"నమ్మారా? సినీమాలో సంసారమంత ఘోరం ఇంకోటిలేదు. సినీమాలో నటనే జీవితంలోనూ చూపుతారు"

"ఎందువల్ల సుఖం వుండదంటారు?"

"నాకేం తెలుసు? మీవంటివారు తెలుసుకోవలసిందే. అక్కడ వాతావరణమే అసహజం. వికృతం, ఘోరం. సంసారం ఎంత ఘోరం కానీండి. జబ్బులూ, తగాదాలూ, బీదరికం ఎంత వుండనీండి ఓ సహజమైన సంబంధం వుంటుంది."

"ఏం సహజ సంబంధం పోదు ? గతిలేక పడివుండడం !" అన్నాను.

"ఘోరమైనా, అది వాస్తవమైన ఘోరం. ప్రేమ కానీ, అసహ్యం కానీ, మనిషికీ మనిషికీ వుంటుంది. ఇక్కడ అంతా, నిజ జీవితంలోకూడా వుత్తమాయ. ఒకర్నొకరు ఖ్యాతికి ఉపయోగించుకోడం భర్తా, బిడ్డాకూడా. ఎందుకట్లా అంటే, అక్కడ మనసులూ, స్వభావాలూ అట్లా తయారవుతాయి, ఒక్కటి చూడండి, తార కీర్తి అధికమైన కొద్దీ, కుంకంబొట్లూ, మర్యాదలూ, సాధ్వీ లక్షణాలూ, అవినీతి ఖండనలూ ఎక్కువౌతాయి. మాయగాక ఇంకేమంటారు? డబ్బయినా ఎన్ని వంచనలు, బేరాలు, దడిపింపులు, తప్పుడు లెక్కలు. ఆ డబ్బు!"

"పోనీ గొప్ప కళాసేవ కద!"

"అదీలేదు. మీరు కథలో గొప్ప పాత్రని సృష్టిస్తే అది మీలో గొప్పతనం. కాని ఎన్నేళ్ళు సావిత్రి పాత్రని నటించినా ఆ పాతివ్రత్యం మమ్మల్ని ఏమూలా అంటదు. ఏ విధంగా మోసంచేసి, సావిత్రని అనిపించుకుందామా అని తప్ప ఇంకేమీలేదు."

"నువ్వు అంత విరక్తి ఎందుకు పడ్డావోగాని జీవితమే దొంగతనం, అబద్ధం."

"ఏమిటి? మరీ సినిక్‌వైనావు?" అన్నాడు సుబ్బారావు.

"సినిక్ కాదు. సినీమాల్నే ఎందుకు తిట్టడం, అంతటా అదేకదా ? దొంగతనం సహించలేని మనసులకి దొంగతనం ఎక్కడలేదూ ? అంటున్నాను. ఇంక సినిమా పరిశ్రమలో మంచి మనుషులే లేరంటావా?"

"వున్నారు. కాని వాళ్ళు అసలు పుటకలో మంచివాళ్ళు. కాని పదేళ్ళు సినీమాలో గడిపిన తరవాత వాళ్ళ మొహాలు చూడండి మీకేతెలుస్తుంది, మనిషి పూర్తిగా నాశనమౌతాడు"

"నాశనం అంటే?"

"డబ్బూ వస్తుంది. కీర్తీ వస్తుంది. మనుషులు మరి వాటికోసమే కదా జీవించేది?"

"కాదు మీకు తెలీదు, లోపల్నించి శాంతి, సుఖం, స్నేహం, వాత్సల్యం వీటిని దొలిచి దొలిచి తినేస్తుంది సినీమా. దుర్మార్గాన్ని ఎందుకు ఖండించారు? వీటిని నాశనం చేస్తుందనే. వాళ్ళలో ఏం జరుగుతుందో, ఏమైపోతున్నారో వాళ్ళకే తెలీదు. దృష్టి అంతా పైకి పాకడం, బొమ్మల ప్రదర్శనం, జీతాలూ-ఇంతే. అన్నిట్లోకి యీ కళ వొట్టి వొళ్ళు ప్రదర్శించుకునే కళ. శరీరం అందం చాలా గొప్పదే. కాని మనిషిలో తక్కిన అందాలముందు చాలా అధమం. పైగా కృత్రిమమైన సౌందర్య ప్రకటన సిగ్గుమాలిన పని. ఇంత ఎందుకు

మాట్లాడుతున్నానంటే మీరేమన్నా రాయగలరేమోనని. శుభ్రమైన యువకులు ఏమైపోతున్నారనుకున్నారు, ఆ స్టూడియోల చుట్టూ తిరిగి!"

"తప్పకండా రాస్తాను" అని లేచాను.

కాని ఆమె మమ్మల్ని వదలలేదు.

"వుండండి, ఈ మాట విని వెళ్ళండి. మొగవాళ్ళు నాటకాలలో ఆడవేషాలు వేసే కాలంలో ఆడవాళ్ళుగా తయారయ్యే వారు. అవునా ? అట్లానే వేషాలు వెయ్యగా వెయ్యగా మేమూ వేషాలే ఐపోతాము. పతివ్రతవేషం వేస్తేనేం, పాతివ్రత్యం చూపించడంలో కాదు మా దృష్టి. అందంలేని పతివ్రత వుండకూడదా ? కష్టాలుపడని పతివ్రత వుండకూడదా ? వీల్లేదు. ఎంతకీ ప్రేక్షకుల్ని ఆకర్షించాలి, అందంతోనూ, కులుకులతోనూ, ఏడుపులతోనూ, వీరా లాపాలతోనూ. వేశ్యావృత్తిలోవున్న నీచత్వమే. వేశ్యా, కులస్త్రీ చేసే పనే చేస్తోంది. కాని ఆ దేహాకర్షణకి తన మనసునీ ఆత్మనీ అర్పించుకుంటోంది. దేహానుభవం ఉన్నతానుభవానికి సాయంవలసింది పోయి, తన సమస్త శక్తులూ బాహ్య ప్రకటనకి మాత్రం సాధనమవడం మనిషిని గుల్లచేసి వికృతంచేసి పెడుతుంది. కళ! కళ! పత్రికల్లోనేగాని స్టూడియోల్లో ఆ మాట వున్నదని జ్ఞాపకంవున్న మనిషేలేడు."

ఇంకా ఏం చెప్పేదో, తలలు వంచుకుని మేమిద్దరం బైటికి వచ్చేశాము తొందర తొందరగా.

కొంతదూరం పోయి,

"పందెం ఓడారు మీరు" అన్నాను.

"ఏం వోడాను, నీ మొహం ?"

"తెనాలిమీది విరహంవల్ల వచ్చేసింది అన్నారు"

"కాక !"

"బలేవారే! ఇంతసేపేం విన్నారు!"

"అవన్నీ నిజమనుకుంటున్నావా ?"

"కాదా? అయితే ఎందుకు చెపుతుంది అంత గట్టిగా?"

"ఎందుకా? నీమల్లే ప్రశ్నలు వేసేవారి బాధపడలేక"

"పొండి మరీను. ఆమె ఆత్మ ఆ సినీమాల్లో ఎంత నలిగిందో తెలీటంలేదా?"

"ఏమీలేదు. డబ్బు, కీర్తి, గొప్ప, పోటీ, ఇన్ని సంతుష్టి పరిచే విషయాలు వుండగా ఓ మూల కాస్త ఆత్మ నలిగినా యిబ్బదేం కాదు."

"మరి ఎందుకు వచ్చేసిందీ? అది చెప్పరేం ?"

"తెనాలిని విడిచి బతకలేక"

"మీకెట్లా తెలుసు?'

"తెనాలి మనుషులు అంతే. సాంబం మామయ్య కన్న గొప్పదేమిటి?"

ఇంక నేనేం మాట్లాడను?

ఆయనే అంటున్నాడు.

"ఆ అశాంతి, ఒంటరితనం, అదంతా ఏమిటి ? తెనాలిని విడిచి బతకవలిసిరాడమే. అంతదూరమెందుకు? నీ రాతల్లో ఏదో కాని ఏదో అర్థంలేని అశాంతి, నిరంతరాన్వేషణ, ఇట్లాంటి పదాలు రాస్తావు. అవన్నీ అబద్ధమనుకో. వాటిల్లో ఏ మూలనన్నా నిజం వుంటే,... నువ్వు తెనాలిని వదిలి బతకడంవల్ల పుట్టిన జాడ్యం. నేనే గెలిచాను... వూరుకో. ఇంటికి పద భోంచేద్దాం."

◆ ◆ ◆

*ప్రచురణ : (కొత్తచిగుళ్ళు కథల సంపుటి) రమణస్థాన్ పబ్లికేషన్స్, 1962*